# 14. పిచ్చికగూడు

**పది** రోజుల్లో ఆ ఉత్తరాన్ని పదిసార్లు చదివాడు సుబ్బరామయ్య.

"మీకు ఉత్తరం రాద్దామనుకుంటూనే అశ్రద్ధ అయిపోయినది. అబ్బాయి అభిప్రాయం తెలుసుకుని వ్రాద్దామనుకొన్నాము. మీ వూరి నుండి రాగానే అబ్బాయికి బెంగుళూరులో ఇంకేదో పెద్ద ఉద్యోగానికి ఇంటర్వ్యూకు రమ్మని కాగితం వచ్చినది. ఇంటర్వ్యూకి బెంగుళూరు వెళ్ళి అక్కడి నుండి అట్లా మైసూరు, మద్రాసు వెళ్ళి స్నేహితుల్ని పలకరించి వస్తానని పది రోజులు సెలవు పెట్టి వెళ్ళినాడు. వాడు రాగానే వాడి అభిప్రాయం కనుక్కుని మేమే మీకు జాబు వ్రాస్తాము. మీరు గుర్తు చెయ్యనవసరం లేదు. మా కందరికి మీ సంబంధం నచ్చినట్టే. అబ్బాయి అభిప్రాయమే బాకీ." అదీ గుంటూరు నుంచి వచ్చిన ఉత్తరం సారాంశం.

సుబ్బరామయ్య ఉత్తరాన్ని బల్లమీద పెట్టాడు.

నిన్న సాయంకాలం బీచ్‌లో పిచ్చిక గూళ్ళు కట్టుకుంటున్న పిల్లలతో సమానంగా ఆడుకున్న లలిత కళ్ళలో కదలాడింది సుబ్బరామయ్యకు. దానికి ఈ సంబంధం రైటైతే సుఖపడుతుంది. కుర్రాడు చక్కగా ఉన్నాడు. బుద్ధిమంతుడని అతను చదివిన కాలేజీలో లెక్చరరుగా పనిచేసిన గోపాలకృష్ణగారు చెప్పాడు. సెంట్రల్ గవర్నమెంటులో శుభ్రమైన ఉద్యోగం. తల్లీ, తండ్రీ ఎంతో మంచివాళ్ళని, వాళ్ళ కుటుంబానికి ఆ చుట్టపట్ల మంచి పేరున్నదని తెలిసింది.

అమ్మాయికి పాటలు పాడ్డం వచ్చా అని కాబోయే అత్తగారు అడిగింది. "అదేంటమ్మా అలాంటి ప్రశ్నలడుగుతావూ?" అని ఆ అబ్బాయి నొచ్చుకున్నాడు. ప్రశ్నకి జవాబుగా లలిత ఒక పాట పాడితే మరొక్కటి, ఇంకొక్కటి అంటూ కొసిరి, నాలుగు పాటలు పాడించుకున్నాడు. పాట బావుందని విడిగా అన్లేదు. అయితేమాత్రం?

నిన్న సాయంకాలం లలిత సముద్రపొడ్డున పిచ్చిక గూడు కట్టినట్టు ఆ రోజు సాయంకాలం - లలిత పెళ్ళి, దానికయ్యే ఖర్చులు, చేసే ఏర్పాట్లు, దాని సంసారం ముందు ముందు మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఎట్లా వర్ధిల్లేదీ వూహించుకుంటూ ఇంట్లో అందరూ కట్టారు పిచ్చిక గూళ్ళు.

ఈ ఇసకలో నీళ్ళుపాలు ఎక్కువైపోయి వాడెవడో కాంట్రాక్టరు కట్టిన బ్రిడ్జి ప్రారంభోత్సవానికి ముందు రోజు కూలిపోయినట్టు ఈ పిచ్చిక గూడు కూలిపోగలదు జాగ్రత్త అని నిన్న సాయంకాలం బీచీలో లలిత కట్టిన పిచ్చిక గూడును చూసి తాను తమాషాగా హెచ్చరించడం గుర్తొచ్చింది సుబ్బరామయ్యకు.

బల్లమీది ఉత్తరం కోటు జేబులో పెట్టాడు సుబ్బరామయ్య.

"దొరగారు రమ్మన్నారట, సార్!" అని వినయంగా వంగి, రహస్యం చెబుతున్నట్టు చెప్పాడు అటెండరు.

సుబ్బరామయ్య కుర్చీలో ఇబ్బందిగా కదిలి, ఎదురుగా ఉన్న ఫైళ్ళ దొంతరలోంచి ఒక

ఫైలు వెలికి తీశాడు.

"స్పీక్!" అని రాశారు దొరగారు, ఆ ఫైలు మీద.

పది రోజులైంది.

రాసిన తరవాత అయిదు రోజుల వరకు వారు క్యాంపులో ఉండి పోయారు. ఆ తరవాత మూడు సార్లు ఆ ఫైలు పుచ్చుకుని కాంపు క్లార్క్ వరకు వెళ్ళి, "దొరగారు" "బిజీగా" ఉన్నారని విని వెనక్కొచ్చెయ్యడం జరిగింది. మూడో సారి కాంపు గుమాస్తాగారు ఆ ఫైలు గురించి తనే దొరగారితో మాట్టాడి సుబ్బరామయ్యను ఎప్పుడు రమ్మనేది చెబుతానని ఫైలు తీసుకున్నాడు. తను మళ్ళీ సీట్లో కొచ్చిన పావు గంటకి ఫైలు తిరిగొచ్చింది. 'ఇంటర్‌కమ్' ఫోనులో క్యాంపు గుమాస్తాగారు మాట్టాడాడు. దొరగారితో ఆ ఫైలు గురించి తను "డిస్కస్" చేసేనని సుబ్బరామయ్య "మండేనాడు" ఆ ఫైలు తీసుకుని దొరగార్ని కలవాలని చెప్పాడు.

ఇవాళ సోమవారం.

దొరగారు తనని పిలిచిన కారణం ఏదైనా కాని; ఇవాళ ఈ ఫైలు గురించి "స్పీకేసి" దీని సంగతి తేల్చెయ్యవచ్చు.

అన్నీ అంకెలు, ఆ ఫైలు నిండాను. ఐదు లక్షలపై చిల్లర వర్కు ఒకే ఐటమ్‌గా వెళ్ళిపోతూంది. శాంక్షన్ పకడ్‌బందీగా ఉంది. ఎస్టిమేట్లు ఈ కేసులో బాగా వెసులుబాటుగా ఉన్నాయి. టెండరు ఫారాల వెల ఎంత, ఎర్నస్టు మనీ ఎంత, ఎగ్జిక్యూషన్ టరమ్స్ ఏమిటి, టెండరు ఫారాలు ఎన్ని అమ్మారు, కనీస టెండరు ఎంత కొచ్చింది, వాడు సరైన రికార్డున్న కాంట్రాక్టరేనా, ఈ వర్క్ తిన్నగా చెయ్యగలడా, ఇలాంటివి లోగడ అతగాడు ఏం చేశాడు, మనం ఏమేం చేయించాము- ఇలాటివన్నీ పట్టికలు వేసి, నోట్‌లు రాసి, ఫ్లాగులు పెట్టి నవకాయ పిండి వంటలతో, షడ్రసాలతో భోజనంలా ఫైలు అమర్చడం జరిగింది.

ఇంక దొరగారు భోజనం చెయ్యడమే తరవాయి.

ఆ వర్క్ గురించి, దానికి సంబంధించిన డివిజన్ అధికారులు, ఉద్యోగులు సుబ్బరామయ్యతో చర్చించారు. కాని దొరగారే "స్పీక్" చెయ్యలేదు. ఈ లోపుగా ఆ వర్క్ గురించి ఎవరి ఆశల మేరకు వారు పిచ్చిక గూళ్ళు కట్టుకున్నారు.

"ఏ కారణం చెప్పకుండా, ఏదైనా ఒకటెండరును కాని, అన్నిటినీ కాని తృణీకరించే హక్కును ఈ దిగువ సంతకం చేసిన వారు కేటాయించుకున్నారు" అనేది టెండరు నోటీసు నిబంధనల్లో చివరిది. సామదాన భేద, దండోపాయాల్లో ఏదీ కనుచూపు మేరకు రానప్పుడు ఈ నారాయణాస్త్రం దాని మీద పడిపోవలిందేను.

"స్పీక్" అని దొరగారెప్పుడయితే రాశారో అప్పుడే అనుకున్నాడు సుబ్బరామయ్య ఈ వర్క్‌కి రెండవ టెండరు పిలుపు తయారు చెయ్యవలసి ఉంటుందని.

గబగబా కోటు తగిలించుకుని, ఫైలు చంకనేసుకుని దొరగారి చేంబర్స్‌కి బయలుదేరాడు సుబ్బరామయ్య.

"అదేవిటండీ బాబూ, ఆ వేషం?" అని పకపకా నవ్వారు, సుబ్బరామయ్యను చూసీ చూడగానే దొరగారు.

కోటు రెండు గుండీల్లో మీది బొత్తాం కింది కాజాకు తగిలించుకుని రావడం చూసుకున్నాడు సుబ్బరామయ్య. ఆయన నవ్వగానే గబుక్కున సరిచేసుకుని తనూ ఒక వెకిలి నవ్వు నవ్వాడు. అప్పుడెప్పుడో చదువుకునేటప్పుడు కాలేజీలో ఎవరో వేసిన భమిడిపాటి కామేశ్వర్రావుగారి "బాగు బాగు" నాటకంలో బాగయ్య కోటు గుర్తొచ్చింద తనికి.

'ఇది మీరు పనిచేసిన బ్రిటిష్ ప్రభుత్వం కాదు మహాశయా. నాదగ్గిరి కొచ్చినప్పుడల్లా ఆ విక్టోరియా మహారాణి కాలపు ఫేషన్ కోటు వేసుకు రానక్కర్లేదు. ఇంకో ఏడాదిలో రిటైరవుతారు గావును. నేనుకూడా ఇక్కడ ఇంకో ఏడాది పాటు ఉంటాను. ఆ కోటు జాగర్తగా తీసుకెళ్ళి ఇంటి దగ్గిర పడెయ్యండి. మీరు రిటైరయినప్పుడు మన వాళ్ళు ఏర్పాటు చేసే వీడ్కోలు సమావేశానికి తెచ్చుకుని దాంతోపాటు ఫోటో దిగుదురు! గాని' అని నవ్వుతూ చెప్పారు; చిన్న వయసుతో, పెద్ద ఫారిన్ డిగ్రీతో మిల మిల్లాడి పోతున్న దొరగారు.

"చిత్తం" అన్నాడు సుబ్బరామయ్య. "ఈ ఫైలు మీద స్పీక్ అని రాశారండి" అంటూ తాడు ముడి వూడదీశాడు.

"ముందు మీ సీటు దగ్గిర కెళ్ళి ఆ కోటు అక్కడ పెట్టి రండి. అప్పుడు మాట్లాడదాం."

"ఆయ" అంటూ వెనక్కొచ్చి, కోటు విప్పి కుర్చీ వెనకాల భద్రంగా తగిలించాడు సుబ్బరామయ్య. బల్లమీద ఇన్లాండు కవరు చూసి, "ఇదింకా ఇక్కడే ఉందా. నయం." అని పైకే అనేసి, దాన్ని కోటు జేబులో తురిమేసి, మళ్ళీ దొరగారి దగ్గిరికి పరుగెత్తాడు.

✤ ✤ ✤

'వెధవ పిచికలు. వీటి గోల మండా. ఇవాళ యీమైతేఐంది, ఈగూడు తీసి అవతల పారేస్తాను' అని ప్రతిజ్ఞ చేస్తూ వీధి గదిలో కొచ్చింది నరసమ్మ.

కోటు స్టాండు మీద ఖాళీ ఉండదు. అక్కడ సుబ్బరామయ్య చొక్కాలు, వాసుగాడి పాంట్లు, ఇంకా ఎవరెవరికి ఏయే గుడ్డలు ఎక్కడెక్కడ అడ్డం రాగలవో అవన్నీ అక్కడే ఉంటాయి. కోటు తెచ్చి అక్కడ పెట్టిన కొత్తలో జాగా చాలక అందరూ విసుక్కోవడమే. కోటు పెట్టిన హుక్కుమీద అదొక్కటే ఉండాలి. దాని మీద ఎంత పొందిగ్గా, పట్టుదలగా అమర్చినా, ఏ గుడ్డ అయినా జారిపోక తప్పదు. దాని కింద పెడదామంటే, రేవులు రేవులు బట్టలు చాకలికి వెడతాయి కాని, కోటు కింద చిక్కడి పోయిన గుడ్డ కనపడి చావదు. చివరికి వాసుగాడికే ఐడియా వచ్చింది.

గోడ మీద ఎత్తుగా ఒక మేకు ఖాళీగా ఉంది. అంతకు ముందు అక్కడ నెహ్రూ బొమ్మ ఉండేది. "పెద్దవాడు హైదరాబాదు వెళ్ళిపోతూ ఆ బొమ్మ తీసుకుపోవడంతో రెండు మేకులు ఖాళీ అయ్యాయి. "జి.వి. సుబ్బరామయ్య, ఆర్.అండ్.బి. డిపార్ట్‌మెంట్" అనే నేమ్‌బోర్డు ఒకటి, ఎవరో చేయించి ఇచ్చింది: బల్ల మీద, మాసిన బట్టల పెట్టె మీద, పీటల సందున, ఎక్కడ పడితే అక్కడ

దొర్లుతూందని, ఆ బోర్డు తెచ్చి, నెహ్రూగారు ఖాళీ చేసిన మేకుల్లో ఒక దానికి తగిలించాడు. రెండో మేకుకి ఈ కోటు వేళ్ళాడ దీస్తే "సింబాలిక్"గా ఉంటుందని, పైగా ఎత్తుగా ఉండడాన్ని, ఎప్పుడు పడితే అప్పుడు "నాన్నారు" దాన్ని తీసి, నా ఉద్యోగం, నా హోదా అంటూ కథలు చెప్పడం తగ్గుతుందని, వాసుగాడు ఆ కోటుని నేమ్‌బోర్డు పక్కన ఖాళీగా ఉన్న మేకుకి తగిలించాడు.

"అదుగోటమ్మా, నాన్నగారి నేమ్‌బోర్డు; దాని పక్కనే ఆయన హోదా!" అని వేళాకోళంగా చెప్పేడు వాసు, ఆ ఘనకార్యం చేసిన మరుక్షణం.

"ఏడిశావ్‌లే."

సరిగ్గా ఆ రెండు మేకులకీ మధ్యగా, గోడకీ డాబా శ్లాబుకీ మధ్య, చిన్న పాత తరహా వెంటిలేటర్ ఒకటుంది. అన్ని తలుపులూ వేసేసినా అందులోంచి పిచికలు రాగలవు. అవి రావడం కిచకిచమని గోల చెయ్యడం, వాటిని తరమడమనేది ఇంట్లో పనుల్లో ఒకటిగా రూపొందడం- అదంతా నరసమ్మ గొడవ.

"రోజుకోమాటు కర్రుచ్చుకుని ఆ పిచికల్ని తరుముతూ ఉంటావు. అవి నిన్నేం అన్నం అడిగాయా, నీళ్ళు అడిగాయా?" అని సుబ్బరామయ్య ఆవిడ మీద చిరాకు పడతాడు.

"ఒకమారు తరుముతున్నానా? హుఁ- మీకేం తెలుసు? పొద్దున్నపోతే రాత్రి ఇంటికొస్తారు. ఈ వెధవ పిచ్చికల గోలతో పగలల్లా పని తోచక, నిద్దర పట్టక మతిపోయి చస్తున్నాను నేను!" అంటుంది నరసమ్మ.

ఆ పిచికలు ఇప్పుడు ఎత్తుగా ఉన్న కోటుని సదుపాయమైన స్థావరంగా కనిపెట్టి, వెడల్పుగా నోరు తెరిచున్న ఎడంపక్క కింది జేబులో చక్కటి, చిక్కటి గూడు అల్లుకున్నాయి. "మా ఇంటికి మేం వచ్చి పోతున్నాం, మధ్య మీ గొడవేమిటి?" అన్నట్లుగా గదంతా స్వేచ్ఛగా హడావుడి చేస్తూ తిరుగుతాయి అవి.

ఒక మాటు అలవాటు ప్రకారం నరసమ్మ కర్రట్టుకుని పిచ్చికల్ని అదరగొడుతూ ఉంటే "వాసుగాడు" కిటికీ పక్కనున్న టేబిల్ అక్కడి కీడ్చుకెళ్ళి, దాని మీద నిలబడి, కోటు జేబులో గుబురుగా పెరిగిన పిచ్చిక గూడుని, అందులో ఉన్న గుడ్లని యథాశక్తి మెచ్చుకుని, "ఇల్లు కట్టి చూడు" అన్నది మనుషులకే కాకుండా పిచ్చుకలకి కూడా వర్తిస్తుందంటూ పిచ్చిక గూళ్ళ ఆర్కిటెక్చర్ మీద లెక్చర్ దంచాడు. ఆవేళ్టి నుంచీ వాడు ఆ పిచ్చిక గూడుకి ట్రస్టీ అయి కూర్చున్నాడు.

✤ ✤ ✤

కర్ర పట్టుకుని వీధి గదిలోకొచ్చిన నరసమ్మ; వేళగాని వేళప్పుడు ఒగర్చుకుంటూ ఇంటికొస్తున్న సుబ్బరామయ్యను చూసి గతుక్కుమన్నాది.

ఈ ముప్ఫయి మూడేళ్ళ సర్వీసులో, మధ్యాహ్నం పన్నెండు గంటల వేళప్పుడు సుబ్బరామయ్య ఇంటికొచ్చెయ్యడం ఇది మూడోసారి కాబోలు. మొదటి మాటు "దొరగారు కాంపు రమ్మంటున్నారు, అర్జంటుగా బట్టలు సర్దు" అంటూనూ, రెండో మాటు "ఉన్నట్టుండి జ్వరం వచ్చింది" అంటూనూ వచ్చా డింటికి.

మళ్ళీ ఇవాళ!

"అదేం?" అంటూ తెల్లబోయింది సరసమ్మ. "ఇంకా పదకొండు నెల్ల సర్వీసున్నాది. ఇవాళే

రిటైర్ చేసేసేరా? యమర్జెన్సీ దెబ్బా? లేకపోతే ఒంట్లో ఏమన్నా సుస్తీయా?" -ఇన్ని ప్రశ్నలు దాక్కున్నాయి ఆ రెండక్షరాల్లోనూ.

"అది సరే, ఆ గుంటూరు సమ్మంధం వాళ్ళు, లలిత వాళ్ళకి నచ్చిందని మూణ్ణెల్లకిందట రాసేరుట! ఆ ఉత్తరం మనకు అందలేదా ఏమిటి?" అన్నాడు సుబ్బరామయ్య.

"ఏమిటేమిటీ?" అని కర్రని మూలకి చేరేసి, నడుం కట్టు వదులు చేసుకుని, దాంతో మొహం మీద చెమటను వత్తుకుంటూ అతని దగ్గరగా వచ్చింది నరసమ్మ. కుర్చీలో కూర్చుని చెమట్లు కక్కుతున్నాడు సుబ్బరామయ్య. తల్లీ, తండ్రీ ఆపసోపాలు పడుతున్నారని వాళ్ళనెత్తి మీద ఫాన్ తిప్పాడు వాసు.

"ఉత్తరాలు ఇంటికి రావడంలేదు మరి. ఎవరికిచ్చినా ఆఫీసు అడ్రసే ఇస్తారు మీరు. అక్కడికే రాసుంటారు వాళ్ళూను. మరి మీరు సెలవైనా పెట్టలేదే అప్పట్నుంచి ఇప్పటిదాకాను. పైగా ఆదివారాలు కూడా వెళుతున్నారాయె!" అంది నరసమ్మ తీరిగ్గా.

"ఆఫీసుకొస్తే ఉత్తరం పోదే బాబూ!" అన్నాడు సుబ్బరామయ్య, తల పట్టుకుని.

"ఇంటికొస్తే పోతుంది కాబోసు!" బంగార్లాంటి సంబంధం చెడిపోయిందేమోనన్న దిగులుతో ఇంకేమీ చెయ్యలేక వ్యంగ్యంగా మాట్లాడింది నరసమ్మ. బంగార్లాంటి సమ్మంధం చెయిజారి పోతుందేమోననే, సుబ్బరామయ్య బెంగ కూడాను.

'ఇంతకీ వాళ్ళు మూడు నెల్లకిందట ఉత్తరం రాసినట్టు ఇవాళ మన కెలా తెలిసింది నాన్నా?' అన్నాడు వాసు.

"ఆ అబ్బాయి చదివిన కాలేజీలో లెక్చరర్ గోపాలకృష్ణగార్లేరూ? - అప్పుడోసారి మనింటికొచ్చాడుగా! అతను మళ్ళా ఇవాళ కనుపించి చెప్పాడు: "మీకు ఉత్తరం రాసి మూడు నెల్లయినా మీరు సమాధానం ఇవ్వలేదుట. మీ అమ్మాయికి వాళ్ళబ్బాయి నచ్చలేదేమో అనుకుని వాళ్ళు వేరే సంబంధం ఒప్పుకున్నారూ అంటూను!"

"అయితే ఒట్టిదే! వాళ్ళు మనకి ఉత్తరమే రాసుండరు. మనం ఇస్తామన్నది వాళ్ళకి సరిపోలేదేమో!" అన్నది నరసమ్మ.

"పది రోజుల్లో అబ్బాయి అభిప్రాయం కనుక్కుని రాస్తామన్నారుకదా. ఆ ఉత్తరం వచ్చిందే మరి!" అంటూ, ఆ ఉత్తరంలోనే మీ సంబంధం మాకు నచ్చిందనో, నచ్చలేదనో సూచనప్రాయంగా రాసుంటారని అనుకున్నాడు సుబ్బరామయ్య. "ఏదీ, వాసూ, ఆ ఉత్తరం ఇలా పట్రా!"

వాసు టేబిల్‌ని గోడ దగ్గరకు జరిపాడు. దాని మీదెక్కి నుంచున్నాడు.

"ఇప్పుడదెందుకెక్కావురా? ఉత్తరం వెతికి పట్రారా అంటుంటే!" అని గద్దించాడు సుబ్బరామయ్య.

పాదాల మీద పైకి లేచి, చేతులెత్తి, కోటు జేబులో తడిమాడు వాసు. "ఆ ఉత్తరం ఈ కోటు జేబులోనే ఉండాలి నానారూ. ఈ మధ్యనే చూశాను!" అంటూ ఉత్తరం తీశాడు. "ఇదుగో" అని అందించాడు సుబ్బరామయ్యకు "ఇదేగా" అన్నాడు.

వాసు అందించిన ఉత్తరం చూసి సుబ్బరామయ్య గాభరా పడ్డాడు. అది - అంటించి ఉన్న ఇన్లాండు లెటరు!

అంటే?- వాళ్ళు ఉత్తరం రాస్తే, తను ఆ ఉత్తరం అందుకునీకూడా చదవకుండా, కనీసం విప్పకుండా కోటుజేబులో పెట్టేసి మర్చిపోయాడా? దానిమీద పిచ్చికగూడు లేచిందా?

ఉత్తరం తెరిచాడు సుబ్బరామయ్య.

"మీకు పది రోజుల క్రితం మేము వ్రాసిన ఉత్తరం అంది ఉంటుందని భావిస్తున్నాము. అబ్బాయి ఇవాళే వచాడు. వాడికి ఇంటర్వ్యూలో ఆ ఉద్యోగం వచ్చినట్లు ఆర్డరు కాగితం కూడా ఇవ్వాళే వచ్చింది. ఇదంతా మన రెండు కుటుంబాలకు శుభ సూచకం. మీ అమ్మాయిని గురించి వాడి అభిప్రాయం తెలుసుకున్నాము. వాడికి ఇష్టమే అని తెలిపినాడు.మీరు మిగతా ఏర్పాట్లు చేయవచ్చును. వెంటనే జాబు వ్రాయగోర్తాను-'' అది, ఆ ఉత్తరం సారాంశం.

"ఇదుగో, నాన్నారూ, ఇందులో ఇంకో ఉత్తరం ఉంది, అన్నాడు వాసు. లోపల చెయ్యి పెట్టి లాగుతూ విప్పి చదివి, పదే పదే చదివి, నలుగురికీ వినిపించిన మొదటి ఉత్తరం అది. దాన్ని లాగడంలో పిచ్చిక గూడు టేబిల్ మీద పడి గుడ్లన్నీ చితికాయి. పిచ్చిక గూడు ఛిన్నాభిన్నం అయింది.

✻

***("ఆంధ్రప్రభ" వీక్లీ : 12-9-1979)***

*• ప్రఖ్యాత కథా రచయిత చాగంటి సోమయాజులుగారు ఓ సాయంకాలం కులాసా కబుర్లలో ఈ కథలో ఉన్న మెయిన్ పాయింటు చెప్పేరు. "ఇది కథ అవుతుంది కదండీ?'' అంటేను; "అవుతే రాసీ!'' అన్నారు. సరే కదా అని రాసి ఆంధ్రప్రభకి పంపిస్తే ప్రచురించేరు. ప్రచురణ జరిగిన కొన్నాళ్ళకి, ఆంధ్రప్రభ వీక్లీ సంపాదక వర్గంలో ఉన్న 'ఎల్లోరా' గారు నాకొక ఉత్తరం రాసేరు. 'మీ పిచ్చిక గూడు కథ ఒక ఇటాలియన్ కథని అనుసరించి రాసేరని మాకు ఉత్తరాలొస్తున్నాయి; దీనికి మీరేమంటారూ?' అని. ఆ ఇటాలియన్ కథ పేరేమిటి, దాని రచయిత ఎవరు- తెలియజేస్తే అది ఎలాగో సంపాదించి చదువుతాను, చాసోగారిక్కూడా వినిపిస్తాను' అని జవాబు రాసేను. ఇప్పటికీ ఈ రీసెర్చి తెమల్లేదు...*

*With best Compliments From*

**VISAKHA FINANCE**

SHOP NO. 15, ARUNODAYA COMPLEX,
1ST LANE, DWARAKANAGAR, VISAKHAPATNAM - 530 016

**M. Srinivas,** M.B.A.
*Managaing Partner*

**M. Satish**
Executive Partner

Phone : 532112